క్లుప్తంగా

నేడు నాటక ప్రదర్శన

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌజ్‌లో నేడు (మంగళవారం) ఉదయం 11గంటలకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం శరణం గచ్ఛామి డాక్టర్ అంబేడ్కర్ మాత రమాబాయి జీవిత చరిత్రను వివరించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనకు జిల్లాలోని ప్రజలు హాజరై తిలకించాలన్నారు.

ప్రమాదకరంగా రహదారి



మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం నుంచి మేడారం వెళ్లే ప్రధాన రహదారిపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఏర్పడిన గుంత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఏమాత్రం ఏమర పాటుగా ప్రయాణించిన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అవగాహన



భూపాలపల్లి రూరల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై సోమవారం ఇల్లందుక్లబ్ హౌజ్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గార్బెజ్ ఫ్రీ ఇండియా నినాదంతో ప్రతి గ్రామంలో పరిశుభ్రతను పెంచుటకు సెప్టెంబర్ 15నుంచి అక్టోబర్ 2వరకు వరకు గ్రామాల్లో చేపట్టవలసిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పురుషోత్తం, డీపీఓ ఆశాలత పాల్గొన్నారు.

నాగేశ్వరరావును కలిసిన నాయకులు



భూపాలపల్లి రూరల్: జిల్లా సంక్షేమ శాఖ అధికారిగానూతనంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఈరెల్లి నాగేశ్వరరావును సోమవారం భారత జాగృతి దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యల కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో దివ్యాంగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. జిల్లాలోని దివ్యాంగుల సమస్యలను జిల్లా అధ్యక్షుడు కొయ్యల కుమారస్వామి జిల్లా సంక్షేమ శాఖ అధికారినాగేశ్వర్ రావుకు వివరించారు. భారత జాగృతి దివ్యాంలాంగుల సంక్షేమ సంఘం నాయకులు జిట్టబోయిన ప్రశాంత్, ముదురుకోళ్ల నర్సయ్య, జగన్నాథం సతీష్, గట్టయ్య, పి.రాజేశ్వరరావు, ప్రభాకర్, రాకేష్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత



టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన అనాథ వృద్ధురాలు సంపంగి ఓదమ్మకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొయ్యడ చంద్రశేఖర్ సోమవారం 25కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు, అనాథలకు ఆపన్న హస్తం అందిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్న హెడ్ కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు. కానిస్టేబుల్ సూర్య ఉన్నారు.

చేయూత

కాటారం: రాష్ట్ర మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్ష్‌ను ఆదర్శంగా తీసుకొని బూసా లక్ష్మయ్య ట్రస్టు సభ్యులు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూతనందిస్తున్నారు. కాటారం మండలంలోని విలాసాగర్ ప్రభుత్వ పాఠశాలను ట్రస్టు సభ్యులు దత్తత తీసుకొని పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ట్రస్టు నిర్వాహకులు బూసా ప్రదీప్ శ్రావణి దంపతులు విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్స్ పంపిణీ చేశారు. గ్రామంలోని వృద్ధులకు దుస్తులు అందజేశారు. పాఠశాల మరమ్మతు చర్యలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. పాఠశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే తమ ట్రస్టు లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సామాజిక సేవా కార్యకర్త దేవి లక్ష్మీనర్సయ్య, నాయకులు నర్సింగారావు, చీర్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సమాజసేవే ధ్యేయంగా ఎన్‌సీసీ



మొక్క నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు



శ్రమదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

- జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ముందడుగు
- పలు రకాలుగా ఉపయోగపడుతున్న ఎన్‌సీసీ సర్టిఫికెట్

మొగుళ్లపల్లి : వారంతా క్రమశిక్షణ, సమాజసేవే ధ్యేయంగా ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్నారు. నాయకత్వ లక్షణాలను పుణికి పుచ్చుకుంటున్నారు. శారీరక, మానసిక వికాసానికి బాటలు వేసుకుంటున్నారు. అంతేకాకుండా దేశభక్తినీ అలవర్చుకుంటున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారు.

2010 నుంచి శిక్షణ ప్రారంభం

వరంగల్ గ్రూప్‌లోని 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో స్కూల్‌లో 2010లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన మహేష్ కృషితో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభమైంది. ఏటా 50 మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. మొదటి, రెండో సంవత్సరాలుగా 25 మంది చొప్పున విభజించారు. ఏటా 40 పరేడ్‌లు చొప్పున మొత్తం 80 పరేడ్‌లతో శిక్షణ అందిస్తున్నారు. అలాగే ప్రతీ సంవత్సరం కొత్తగా 25 మంది విద్యార్థులను చేర్చుకొని రెండో సంవత్సరం శిక్షణ పూర్తి చేసుకున్న 25 మందికి 'ఏ' సర్టిఫికెట్ అందించి శిక్షణ ముగిస్తున్నారు.

క్రమశిక్షణ, దేశభక్తి పెంచేలా..

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందేలా శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, మానవత విలువలతో కూడిన జీవన విధానం, శీల నిర్మాణం, శారీరక, మానసిక దృఢత్వం పెంపొందేలా శిక్షణ కొనసాగుతోంది. సమాజసేవలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింహస్వామి, ఎన్‌సీసీ అధికారి గుండెల్లి రాజయ్య, ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు సామాజిక సేవల్లో క్రియాశీలకంగా భాగస్వాములౌతున్నారు.

మొట్లపల్లిలో సేవా కార్యక్రమాలు

మండలంలోని మొట్లపల్లిలో ఎన్‌సీసీ విద్యార్థులు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలో, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనం పరిఢవిల్లేలా ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్య పనుల్లో పాలుపంచుకుని పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మద్యం తాగాడం వల్ల అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటరు నమోదుపై ర్యాలీలు తీశారు. ప్రమాదాల్లో చనిపోయిన లేదా గాయపడిన సైనికుల కుటుంబాలను ఆదుకునేలా సంక్షేమ నిధి కోసం ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు.

ఉన్నత విద్యలో ఐదుగురికి ప్రవేశాలు

ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసి 'ఏ' సర్టిఫికెట్ పొందిన ఐదుగురు విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రవేశం లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు నర్సింహస్వామి తెలిపారు. పాలిటెక్నిక్‌లో, బాసర ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ కోటాలో సీట్లు పొందినట్టు చెప్పారు. ఎన్‌సీసీ శిక్షణ తీసుకున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు.

అన్ని అంశాల్లో శిక్షణ



ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు అన్ని అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. తద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుంది. విద్యార్థి దశలోనే దేశభక్తి పెంచేలా కార్యక్రమాలు ఉంటాయి. సమాజ సేవల్లో భాగస్వాములయ్యేలా సిద్ధం చేస్తున్నాం. విద్యార్థులు అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- గుండెల్లి రాజయ్య, స్కూల్ ఎన్‌సీసీ అధికారి

ఆత్మవిశ్వాసం పెరిగింది



ఎన్‌సీసీతో ఆత్మవిశ్వాసం పెరిగింది. శిక్షణలో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. సమాజసేవలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తినిచ్చింది. సమాజానికి ఉపయోగపడుతూ చదువుకోవాలని ఆశ. క్రమశిక్షణతో చదువుకుని ఐపీఎస్ సాధించడమే నా ధ్యేయం.

- పవిత్ర, ఎన్‌సీసీ విద్యార్థిని

ఐపీఎస్ సాధించడమే లక్ష్యం



ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందుతున్నా. ఐపీఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. క్రమశిక్షణతో చదువుకుంటూ ఎన్‌సీసీలో రాణించడం ద్వారా ఐపీఎస్ సాధించడం సులువయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నా. దేశభక్తి పెంచేలా శిక్షణ కార్యక్రమాలు ఉంటున్నాయి. ఉత్తమమైన జీవితం గడపడానికి ఎన్‌సీసీ దోహదపడనుంది.

- రజాక్, ఎన్‌సీసీ విద్యార్థి

దెబ్బతిన్న రహదారుల పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం: కాటారం నుంచి మంథని వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయవడంతో సోమవారం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక లారీలు అధిక లోడ్‌తో వెళ్లడంతో రహదారి పెద్ద పెద్ద గుంతలమయంగా మారిపోయిందని వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిల్వడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అధికలోడ్‌తో వెళ్తున్న లారీలను అదుపు చేసి రోడ్లు ధ్వంసం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వే బిల్ లేకుండా ఇష్టానుసారంగా ఇసుక మాఫియా చేస్తూ ఇసుక లారీలు అతివేగంగా వెళ్లడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. గుంతలమయమైన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ఫోన్‌లో కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొట్టె శ్రీహరి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తామని తెలుపుతున్న కార్యకర్తలు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీతో పేదలకు న్యాయం జరుగుతుందని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామంలో ములుగు జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోడూరు రమేష్ అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పేదలకు కరోనా, వరదల సమయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉందన్నారు. ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు, వాళ్ల పార్టీలో పనిచేసే వాళ్లకే గృహలక్ష్మి పథకం అందిస్తామని మాట్లాడడం సరైనది కాదని పేదవారందరికీ ఇళ్లు కేటాయించాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్‌జిల్లా అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, నాయకులు సూర్యనారాయణ, మండల నాయకులు గ్రామ నాయకులు సూర నాయక్, ఉస్మాన్‌పటేల్, తాళ్లపల్లి శ్రీనివాస్, రాంచందర్, అరవింద్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు



చిట్యాల: అరెస్టయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో మధువంశీకృష్ణ



టేకుమట్ల: అరెస్టయిన అంగన్‌వాడీ టీచర్లు

చిట్యాల: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షకు వెళ్లకుండా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పోలీసులు ముందస్తూ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మొకిరాల మధువంశీకృష్ణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. అధికార పార్టీకి చెందిన అనుబంధ సంఘం బీఆర్‌టీయూ నాయకులను వదిలి, సీఐటీయూ, ఏఐటీయూసీ యూనియన్ అంగన్‌వాడీ టీచర్లను అరెస్టు చేయడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

టేకుమట్ల: అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో చేపట్టిన సమ్మె సందర్భంగా సోమవారం ఉదయం మండలంలోని పలు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌కు తరళిన వారిలో అంగన్‌వాటీ టీచర్లు పూర్ణిమ, భాగ్యలక్ష్మీ, స్వప్న, ఉమాదేవి, మంజుల, హేమలత, సునీత, స్వరూప, వనిత, రాణీ, రజిత, ఆశ కార్యకర్తలు కృష్ణవేణి, తిరుమల, శాంత, సుజాత, కట్ల సునీత, మాటేటి పావణి, బోయిని స్వప్న, రత్న కోమల, సరిత ఉన్నారు.

ఆశవర్కర్ల అరెస్టు

కాటారం: జీతాలు పెంచాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాకు తరలివెళ్తున్న మండల ఆశకార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మండల కేంద్రంలో ఆశలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్న తాము సమస్యల పరిష్కారం కోసం ఆందోళన భాగంగా ధర్నాకు వెళ్తుంటే పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం అమానుషం అన్నారు. సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

కాటారం: పీ.వీ.నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుధన్ జాగృతి అభియాన్‌లో భాగంగా ఈ నెల 16న కాటారం మండల కేంద్రంలో ప్రత్యేక పశువైద్య శిబిరం, పాడి రైతుల అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, అధిపతి డాక్టర్ ఎస్.రాజన్న తెలిపారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలను సోమవారం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు పరిశీలించారు. వైద్య శిబిరం, పాడి రైతుల అవగాహన కార్యక్రమంపై స్థానిక పశువైద్య అధికారులతో చర్చించారు. శిబిరం, అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రంగారావు, మండల వైద్యాధికారి డాక్టర్ రాకేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



గండిపడిన చెరువును పరిశీలిస్తున్న ఓదెలు

చిట్యాల: మండలంలోని నవాబుపేట-టేకుమట్ల మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామాల మధ్య వర్షాలకు వంక సముంద్రం చెరువుకట్ట తెగి రోడ్డు మొత్తం కొట్టుకపోయిందని సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఏమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఓదెలు కోరారు. సోమవారం గండిపడిన చెరువు దగ్గర ఆయన పరిశీలించారు. రోడ్డు మొత్తం తెగిపోవడంతో రెండు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయని తెలిపారు. కావున అధికారులు వెంటనే రెండు గ్రామాలకు రాకపోకలు నడిచేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేరేళ్ల రవి, ప్రశాంత్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది

టేకుమట్ల: పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్లు ఈర్ల పూర్ణిమ, పెండెం హేమలత ఈర్ల రజిత అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్(వీ) అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ అడగాని లతారామారావు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, పప్పులను ఎక్కువ మోతాదులో తీసుకుని మాంసాహారాన్ని తక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. బిడ్డకు ఆరు నెలలు నిండగానే తల్లిపాలతో పాటు, అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, చిరుధాన్యాలతో ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన, ఉపాధ్యాయులు కుడికాల శ్రీనివాస్, స్వామి, ఉప సర్పంచ్ అచ్చె కుమారస్వామి, ఆశవర్కర్లు సారమ్మ, రజిని, లావణ్య పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

మల్హర్: ఎస్‌వీఈఈపీ ఎలక్షన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ పాఠశాలలో ఓటు హక్కు నమోదుపై తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు వివరాల కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది



మౌనం పాటిస్తున్న అధికారులు, సిబ్బంది

కాటారం: మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో జాతీయ అటవీ అమరువీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మహదేవపూర్ ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అటవీశాఖ అమరుల త్యాగం మరవలేనిది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాటారం ఇన్‌చార్జ్ రేంజర్ మధుబాబు, డిప్యూటీ రేంజర్ హరిప్రియ, లాక్యా హుస్సెన్, ఎఫ్ఎస్ఓలు లక్ష్మణ్‌రావు, సుమన్, అర్చన, ఎఫ్‌బీఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు



సిరికొండను సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

టేకుమట్ల: హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోతో పాటు, కాటారం సబ్‌డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు కత్తి సంపత్ తెలిపారు. అలాగే ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్‌తో చర్చించాలని కోరినట్లు తెలిపారు.

బోర్లగూడెంలో పారిశుద్ధ్య పనులు

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామంలో సర్పంచ్ గంట వనజ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నీటి గుంతలు తొలగించి బోరుబావుల వద్ద నీటి గుంతల వద్ద మురికి నీటిని తొలగించారు. గ్రామల్లో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి ట్రాక్టర్‌తో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు. బోరుబావుల వద్ద నీటి గుంతల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల దహనం



భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో ఏడు శాతం లేని అగ్రకులాలు పార్టీలకు నాయకత్వం వహించడం ఏంటని ధర్మసమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సాధన జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ నాయకుడు కొత్తూరి రవీందర్ మాట్లాడుతూ 93శాతం ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీలకు అగ్రకుల నాయకులు నాయకత్వం వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద రమేష్, కండే రవి, మంగళపల్లి రాజకుమార్, దొమ్మటి రవీందర్, పుల్ల అశోక్ పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



టేకుమట్ల: పరామర్శిస్తున్న సత్యనారాయణరావు



మహాముత్తారంలో..

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల, వెల్లంపల్లి, కుందనపల్లికి చెందిన గసిగంటి మల్లయ్య, పంజాల లక్ష్మీ, అంబాల మహేందర్, రేనుకుంట్ల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు పొనగంటి సాంబయ్య, తదితరులు ఉన్నారు.

కలికోటలో..

మండలంలోని కలికోటలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కొలాని అశోక్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ గర్మిళ్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లబెల్లి విజేందర్ ఆధ్వర్యంలో పరామర్శించి, రూ.2000ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, ఆడెపు సంపత్, మద్దెల కుమార్, నల్లబెల్లి మొండయ్య, పిట్టల రవి, తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెంకు చెందిన టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అందె భాస్కరచారి తండ్రి నారాయణ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సోమవారం మంథని నియోజకవర్గం ఇన్‌చార్జ్ మాదాడి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మెండె రాజయ్య, వీరమల్ల రాజబాపులు ఉన్నారు.